ఏయూ లుక్స్
తెలుగు వార పత్రిక
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్

ANDHRA UNIVERSITY
Accredited by NAAC With 'A' Grade
ISO 2001:2015 Certified
aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com
ఫోన్ : 0891-2844000
August 27 - September 02, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan | సంపుటి : 2 | సంచిక : 81 | పేజీలు : 8



## అమృత్‌కాల్ విజన్ 2047తో

# దేశ సమగ్ర భద్రత

**భారత్ విజన్‌ను ఆవిష్కరించిన లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజ సుబ్రమణి**

**'అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ 2022-47'పై ఏయూలో గెస్ట్ లెక్చర్**

**హ్యూమన్, ఎకనామిక్, డిఫెన్స్, సైబర్, స్పేస్ రంగాల భద్రత, పురోగతిపై కార్యచరణ వెల్లడి**

**2047 నాటికి ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా భారత్‌ను నిలపడే లక్ష్యం**

**తొలుతా ఏయూ వీసీతో మర్యాదపూర్వకంగా సమావేశమైన లెఫ్టినెంట్ జనరల్**

**ఏయూ విశిష్టతతో పాటు ప్రగతిని వివరించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి**

**లెక్చర్ అనంతరం ఏయూ ఆ హాబ్ పరిశీలన... స్టార్టప్ కల్చర్ అభివృద్ధిపై ప్రశంస**

**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** దేశంలో హ్యూమన్, ఎకనామిక్, డిఫెన్స్, సైబర్, స్పెస్ రంగాల భద్రత, పురోగతికి 'అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ 2020-47' ద్వారా గొప్ప ముందడుగు లభించనుందని ఆర్మీ సెంట్రల్ కమాండ్ కమాండింగ్ ఇన్ చీఫ్ జనరల్ ఆఫీసర్, లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజ సుబ్రమణి అన్నారు. ఇటీవల ఆయన భారత ఆర్మీ ఉన్నతాధికారులతో కలిసి ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. తొలుతా ఏయూ పరిపాలనా భవనం వద్ద ఎన్‌సీసీ విద్యార్థులు, రక్షణ రంగా ఉద్యోగుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయనకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. వీసీ ఛాంబర్‌లో పలువురు వర్సిటీ ఉన్నతాధికారులను వీసీ ప్రసాదరెడ్డి ఆయనకు పరిచయం చేశారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రాధన్యతతో పాటు ఆంధ్రవిశ్వవిద్యాలయం విశిష్టత, స్వాతంత్ర్య భారతావనికి మేధావులను అందించడం తరువాయి 2లో

## ఉత్తమ ఉపాధ్యాయులుగా..

# ఆరుగురు ఏయూ ఆచార్యులు

వివరాలు 8లో

అనుకున్న లక్ష్యం సాధించాలన్నది ప్రతి విద్యార్థి కల. అందుకు అనుగుణంగా నిత్యం శ్రమించేవారు ఎందరో. అచ్చం అలాంటి కోవకే చెందుతారు ఏయూ పరిశోధక విద్యార్థి గోపిశెట్టి మనోహర్. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్స్ ఫలితాల్లో విజయం సాధించారాయన. తద్వారా ఆర్టీఓగా గ్రూప్-1 జాబ్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఏయూ జాగ్రఫీ విభాగ పరిశోధక విద్యార్థిగా ఉన్న ఆయన్ను "ఏయూ లుక్స్" పలకరించింది. ఈ సందర్భంగా లక్ష్యసాధన దిశగా చేసిన కృషి, ఏయూ సహకారం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహాన్ని ఆయన వివరించారు. ఆయా వివరాలు ఆయని మాటల్లోనే...



బురిడి శ్రీకాంత్, వమ్మరి తిరుపతిరావు
ఏయూ జర్నలిజం విభాగ సీనియర్ విద్యార్థులు

వివరాలు 6లో

## ఏయూ విద్యార్థి..

# గ్రూప్-1లో మెరిశాడు

**ఆర్టీఓగా ఎంపికైన ఏయూ జాగ్రఫీ పరిశోధక విద్యార్థి మనోహర్**

**క్యాంపస్‌లోనే కల సాకారం కావడంపట్ల హర్షం**

**అభినందించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, విభాగ ఆచార్యులు**

## వర్సిటీలో వైభవంగా..

# తెలుగు భాషాదినోత్సవం

**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు భాషాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికారసంస్థ వారి ఉత్తర్వ్యాల మేరకు ఆంధ్రవిశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు , విశిష్ట అతిధిగా రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్, ఆత్మీయ అతిధులుగా ఆచార్య జి యోహానుబాబు , డాక్టర్ దామెర వెంకటసూర్యారావు. డాక్టర్ మీగడ రామలింగస్వామి, శ్రీ పరవస్తు పణిశయన సూరి హాజరయ్యారు. రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ మాతృభాషలో అనర్గళంగా మాట్లాడలేని వారు పరభాషలలో కూడా మాట్లాడలేరన్నారు. మనం చదువుకి ఇచ్చే ప్రాధాన్యత కంటే భాషకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చాలా మంది విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకున్నప్పటికీ తరువాయి 4 లో




## ఏయూను సందర్శించిన

# అమెరికన్ కాన్సులేట్ బృందం



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికన్ కాన్సులేట్ అధికారుల బృందం సందర్శించింది. హైదరాబాదులోని అమెరికన్ కాన్సులేట్ ప్రిన్సిపల్ కమర్షియల్ ఆఫీసర్ రాఘవన్ శ్రీనివాసన్‌తో కూడిన ముగ్గురు అధికారులు ఏయూకు విచ్చేసి తొలుతా ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అమెరికన్ కార్నర్ సెంటర్ పనితీరు, చేపట్టిన కార్యక్రమాలతో పాటు ప్రగతి నివేదికను అమెరికన్ కార్నర్ మెంటర్, ఏయూ అంబేద్కర్ ఛైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వారికి వివరించారు. గత రెండేళ్లలో 80 కార్యక్రమాలతో పాటు చాట్ విత్ డిప్లమాట్, ప్యానల్ డిస్కషన్, బుక్ రీడింగ్ సెషన్స్, విభిన్న అంశాలపై చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. తరువాత అంబేద్కర్ ఛైర్ కార్యాలయం, ఏయూ ఫార్మశీ కళాశాల, రసాయన శాస్త్ర విభాగం, ఫార్మ ఇంక్యుబేషన్ హబ్‌లను వారు సందర్శించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో ఆయని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీసీ వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాజేంద్రప్రసాద్‌తో పాటు ఆచార్య ధనుంజయరావు, ఆచార్య బసవయ్య, ఆచార్య వి.సిద్దయ్య, ఆచార్య ఈశ్వరకుమార్, ఆచార్య రాంజీ, యుఎస్ కాన్సులేట్ ప్రతినిధులు సునీల్ కుమార్, త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలో ఘనంగా

# జాతీయ క్రీడా దినోత్సవం

**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ది ఒలింపిక్ అసోసియేషన్ విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్‌తో పాటు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. తొలుతా భారత హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తికి ఏయూ క్రీడాకారులు నిజమైన వారసులుగా నిలవాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాల్లో రాణించి సత్తాచాటాలని సూచించారు. ధ్యాన్‌చంద్ పుట్టినరోజును పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించడం ఆయన క్రీడా విజయాలకు, దేశానికి అందించిన గుర్తింపుకు నిదర్శనమన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ ప్రపంచ నంబర్ వన్ క్రీడాకారుడిగా నిలవడమే తరువాయి 2 లో





# అమృత్‌కాల్ విజన్ 2047తో.. దేశ సమగ్ర భద్రత



▶▶ మొదటి పేజీ తరువాయి

ద్వారా దేశానికి ఏయూ అందించిన సేవలను వివరించారు. అనంతరం వర్సిటీ తరపున లెఫ్టినెంట్ జనరల్ రాజ సుబ్రమణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య సమతతో పాటు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శశిభూషన్‌రావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రాజేంద్రప్రసాద్, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య విజయలక్ష్మి, ఐఏఎస్ఈ ప్రిన్సిపల్ ఆచార్య శోభశ్రీ, ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య భట్టి తదితరులు పాల్గొన్నారు.



## 'అమృత్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ'పై గెస్ట్ లెక్చర్..

వర్సిటీ పర్యటనలో భాగంగా వీసీతో మర్యాద పూర్వక సమావేశం అనంతరం ఆర్మీ సెంట్రల్ కమాండ్ కమాండింగ్ ఇన్ చీఫ్ జనరల్ ఆఫీసర్, లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజ సుబ్రమణి ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో 'అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ' అంశంపై ప్రత్యేక ప్రశంగం చేశారు. అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ 2022- 2047 ద్వారా దేశంలోని బహుముఖ రంగాల సమగ్ర భద్రతకు భారత ప్రభుత్వం బాటలు వేస్తున్నట్లు తెలిపారు.




సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో దేశంలోని అన్ని రంగాల ప్రగతికి ప్రత్యేక కార్యచరణ అవలంభించడంతో పాటు కట్టు దిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ఇందుకు అనుగుణమైన సమగ్ర పురోగతి కోసం భారత ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వశాఖలు అందుబాటులోకి తెచ్చిన విజనరీ ప్రాజెక్టే అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ 2022- 2047 అన్నారు. హ్యూమన్, ఎకనామిక్, డిఫెన్స్, సైబర్, స్పేస్ రంగాల భద్రత, పురోగతే ఈ ప్రాజెక్టు ముఖ్యఉద్దేశమన్నారు. ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ థ్రెట్స్‌తో పాటు అనుకోకుండా ఎదురయ్యే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలను సంసిద్ధం చేయడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యమన్నారు. భారత త్రివిధ దళాలు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అత్యంత బలమైన వ్యవస్థలుగా రూపాంతరం చెందు తున్నాయన్నారు. రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంచుకోవడంతో పాటు ఆధునిక ఆయుధాల తయారీ, ఎగుమతిపై పెద్ద ఎత్తున దృష్టిసారించినట్లు తెలిపారు. రూ.2.5 లక్షల కోట్లు ఆదాయం సృష్టించే దిశగా రక్షణ రంగ కార్యచరణ జరుగుతోందన్నారు.

అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి దేశానికే గర్వకారణమన్నారు. అంతరిక్షంలో ఆధిపత్యం చూపే దేశం రక్షణ రంగంలో పట్టు సాధిస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోడి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు అయ్యేనాటికి దేశం స్వయం సంవృద్ధి సాధించాలనే లక్ష్యాన్ని ఎర్రకోట నుంచి నిర్దేశించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీనిలో భాగంగా దేశ రక్షణ రంగం దేశీయంగా తయారీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్మీ దేశ రక్షణతో పాటు విద్య, రహదారుల నిర్మాణం, సుదూర ప్రాంతాలను అనుసంధానం చేయడం వంటి కార్యక్రమాలలో భాగమవుతున్న విధానాన్ని వివరించారు. దేశ సరిహద్దులో ఉండే గ్రామాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వలసలు కల్పించడం, సరిహద్దు ల్లో మౌళిక సదుపాయాలు, ఇతర దేశాలతో సంయుక్త సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నికరమైన అభివృద్ధితో పాటు సాఫ్ట్ పవర్, సర్వీస్ రంగాల్లో పురోగమనానికి రూపొందించిన కార్యచరణను ఆయన వివరించారు.

## ఆ హబ్ సందర్శన..

అనంతరం లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజ సుబ్రమణి ఏయూ స్టార్టప్స్ సెంటర్ ఆ హబ్‌ను సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ ఆయన వెంటవుండి ఆ హబ్ ద్వారా జరుగుతున్న ఇన్నోవేషన్ ప్రాజెక్టులను, ఆవిష్కరణలను వివరించారు. 204 కంపనీలు ఏయూ ఆ హబ్‌లో భాగస్వామిగా ఉన్నట్లు వెల్లడించారు. ఆయా కంపనీలు ఆవిష్కరణలు దిశగా చేస్తున్న కృషిని రాజ సుబ్రమణి స్వయంగా తెలుసుకొని ప్రశంసించారు. అంతకు ముందు ఆయన ఏయూ వీసీ, వర్సిటీ ఉన్నతాధికారులతో కలిసి వైవీఎస్ మూర్తి ఆడిటోరియం ఆవరణంలో మొక్కలు నాటారు.



# వర్సిటీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

### ద్యాన్‌చంద్ క్రీడా స్ఫూర్తికి వారసులుగా నిలవాలి

### వర్సిటీ క్రీడాకారులకు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ దిశానిర్ధేశం


▶▶ మొదటి పేజీ తరువాయి

కాకుండా అనేక దేశాల అభిమానులను సంపాదించుకున్నాడన్నారు. 1928 ఒలింపిక్స్ లో స్వర్ణం, 1932లో స్వర్ణం, 1936 ఫీల్డ్ హాకీ ఒలింపిక్ లో వరుసగా బంగారు పతకాలు సాధించిన ఘనత ద్యాన్‌చంద్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్, వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ ఏ.పల్లవి, ది ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి కె.సూర్యనారాయణ, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరావు, ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వరరావు, పీఈటీ సత్యనారాయణ, జిల్లా క్రీడా సంస్థ చీఫ్ కోచ్ జూన్ గాలియట్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనభరచిన క్రీడాకారులను సత్కరించారు.

క్రీడా దినోత్సవాన్ని పురష్కరించుకొని మిడిల్ క్లాస్ బైకర్ సహకారంతో మాంక్‌ఫిట్ సంస్థ నిర్వహించిన మేగా రక్తదాన శిబిరాన్ని ఆచార్య విజయమోహన్, డాక్టర్ పల్లవి ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా ఛత్రపతి శివాజీ బ్లాడ్ బ్యాంకు ప్రతినిధులు 72 యూనిట్లు రక్తాన్ని స్వీకరించినట్లు నిర్వాహకులు మహేష్, శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.



## ముగిసిన ఐపీఆర్ ఆన్లైన్ కోర్సు



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఆన్లైన్ సర్టిఫికెట్ కోర్సు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇటీవల ముగిసింది. ఆరు రోజుల పాటు నిర్వ హించిన ఈ ఆన్‌లైన్ కోర్సులో విద్యార్థులకు మేధోహక్కులు, పేటెంట్లపై విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 210 మంది విద్యార్థులకు ఐపీఆర్ సెంటర్ ఛైర్ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తం దిశానిర్దేశం చేశారు. మేధోహక్కులను వాణిజ్య ఉపయుక్తంగా మలచు కునే విధానాలను వివరించారు.

## డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ. నాయుడు ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగు తోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు. ఆడియో ఇంజనీరింగ్-మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజు ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్-డబ్బింగ్ సర్టిఫి కెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్లో లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్ల మాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సం ఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరిం గ్లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ లో 50 మందికి ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు www.audoa.in వెబ్ సైట్ ను ప్రదించాలన్నారు.

## విదేశీ లాంగ్వేజ్ కోర్సుల్లో ప్రవేశాలు



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఫ్రెంచ్, జర్మన్, జపాన్ భాషల డిప్లొమా కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఫారిన్ లాంగ్వేజెస్ విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల వారు సెప్టెంబర్ 10 వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

# నైపుణ్యంతో కూడిన విద్యకు బాటలువేయాలి

### నాణ్యమైన విద్యను అందించడమే ఆచార్యుల అందరి కర్తవ్యం

### ఆధునిక సాంకేతికతను విద్యార్థులందరికీ చేరువ చేయండి

### బీఓఎస్ సమావేశంలో వర్సిటీ ప్రిన్సిపల్స్‌కు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** నైపుణ్యంతో కూడిన విద్యకు వర్సిటీ క్యాంపస్ కళాశాలతో పాటు అనుబంధ కళాశాలలు బాటలు వేయాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఇటీవల ఏయూ ఈసీ హాల్‌లో నిర్వహించిన వర్సిటీ వార్షిక బిఓఎస్ సమావేశంలో ఆయన పాల్గొని వర్సిటీ, వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్, విభాగాధిపతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్గతంగా సిలబస్‌ల రూపకల్పనపై చర్చించారుఎర. ఏయూ వీసీ ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలను, మార్పులను మన రాష్ట్ర యువతకు చేరువ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి కోరకుంటున్నారన్నారు. ఈ దిశగా పనిచేస్తూ అన్ని కోర్సులను ఐటి సబ్జెక్టులను మిళితం చేస్తూ పనిచేయడం, డేటా సైన్స్, ఎంఐ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. తద్వారా ఈ రంగాలలో వీరు భవిష్యత్తులో నిష్ణాతులుగా మారడానికి ఆరంభంలోనే శ్రీకారం చుట్టాలన్నారు. ప్రోగ్రసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతు లకు దిశానిర్ధేశం చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశ పెట్టాలని సూచించారన్నారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అణ్వేషించడం సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతీ సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించే విధంగా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని నిర్ణయించారు. విద్యార్థి భవిష్యత్తును ఉన్నతంగా మలచే శక్తి మనం తయారుచేసే సిలబస్ కి ఉంటుందన్నారు. విభాగాలు తయారు చేసే సిలబస్ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉండా లని సూచించారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్యభూమిక పోషించాలన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యల నుంచి ఉపశమనం కలిగించే విధంగా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు కావాలన్నారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానంలో సూచించిన విధంగా జిఈఆర్ పెంచుతూ, అందరికీ సమాన అవకాశాలు కల్పన, నాణ్యమైన విద్యను అందించ డం, ఉపాధి కల్పన, ఎంటర్‌ప్యూనర్‌షిప్‌ను పెంచే విధంగా సిలబస్‌ను తీర్చిదిద్దాలని వీసీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహారావు, ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య వి.విజయలక్ష్మి, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.కె భట్టి, ఎస్‌డీఈ డైరెక్టర్ ఆచార్య కె.విశ్వేస్వరరావు, ఆచార్య రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏయూలో డిజిటల్ కాగ్నెటివ్ థెరపి సెంటర్

### అందుబాటులోకి మానసిక సమస్యలను గుర్తించే ఆధునిక టెక్నాలజీ

### ఏయూతో కెనడాకి చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సస్ ఎంఓయూ



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయంతో డిజిటల్ కాగ్నెటివ్ థెరఫి సెంటర్ ఏర్పాటయ్యింది. కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ ఏయూతో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా అధునాత డిజిటల్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ని ఏయూకు అదించింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని నార్త్ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి విద్యార్థులతో పాటు ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ సిఈఓ డాక్టర్ వినయ్ సింఘ్‌తో కలిసి ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నూతన డిజిటల్ టెక్నాలజీ సహాయంతో ఒత్తిడి, డిప్రెషన్, ఆత్మహత్య భావనలను ముందుగా గుర్తించవచ్చు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యవిధానం కంటే వేగంగా విద్యార్థి మానసిక పరిస్థితిని గుర్తించే డిజిటల్ టెక్నాలజీ ఏయూకు అందుబాటులోకి వచ్చిందన్నారు. దీని సహాయంతో విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి అవసరమైన వారికి వెంటనే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో సౌత్ క్యాంపస్‌లో మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వీసీ నిర్వాహకులకు సూచించారు.

# హాస్టల్ మరమ్మత్తులు వేగంగా పూర్తిచేయండి



### ప్రగతి హాస్టల్‌ను సందర్శించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

### పనుల నిర్వహణపై వార్డెన్, ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు

**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ ::** ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతిగృహం ప్రగతి భవన్‌ను ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పరిశీలించారు. వచ్చేనెలలో కొత్త విద్యార్థులు వచ్చే సమయానికి హాస్టల్ మరమ్మత్తులు పూర్తిచేయాలని ఈ సందర్భంగా వార్డెన్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు వచ్చే సమయానికి హాస్టల్ గదులు, టాయిలెట్స్, డైనింగ్ రూమ్ వంటివి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలని, పూర్తిగా రంగులు వేయాలని సూచించారు. నూతనంగా పలు గదులను నిర్మించే అంశంపై చీఫ్ వార్డెన్ వినుత, యూనివర్సిటీ ఇంజనీర్ ఆర్.శంకరరావులతో చర్చించి, పలు సూచనలు చేశారు. పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఏయూలో వైభవంగా తెలుగు భాషాదినోత్సవం

## తెలుగు భాషను వారసత్వంగా భావితరాలకు అందించాలి

## ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్



▶▶ మొదటి పేజీ తరువాయి

భాష విషయం లో వెనుకబడుతున్నారు. అందుకే ఏ భాషనైనా చక్కగా నేర్చుకున్నప్పుడే అభివృద్ధిలోకి వస్తారని వెల్లడించారు. తెలుగు భాషలో అమూల్యమైన గ్రంధాలు ఉన్నాయని అందులో మనకు మన జీవితానికి పనికి వచ్చే అంశాలను ఎన్నో దాగివున్నాయన్నారు. వాటిని గ్రహించి ఇతర భాషల్లోకి తర్జుమా చేసి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలని రచయితలకు, పరిశోధకులకు సూచించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు కృషిచేసినట్లు ప్రతి ఒక్కరు నడుం కట్టాలన్నారు. పర భాష పదజాలం మనభాషలో విరివిగా ప్రవేశించినప్పుడు ఆ భాష మాతృభాషగా మారుతుందన్న ఆయన అది మన సంస్కృతికి మన ఆనవాళ్లకు ప్రమాదం కలిగిస్తుందన్నారు. దీంతో మన భాష ఉనికి కోల్పోతుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి భాషా ప్రగతిని పాటుపడాలన్నారు. తెలుగు విభాగం తెలుగు భాషా వారోత్సవాలు నిర్వహించటం అభినందనీయమని ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెంపొందు తుందన్నారు. తెలుగులో అవధాన ప్రక్రియ మనకే సొంతం అని అటువంటి సాహిత్య ప్రక్రియలకు ఆధునితను మేళవించి భాషను రక్తికట్టించాలని సూచించారు.

ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గిడుగు లాంటి మహనీయుల త్యాగం తోనే ఆంధ్ర విశ్వకళాపరిషత్ లో మొదట తెలుగు విభాగం ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు .ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఎన్నో అంశాలు ఉన్నాయని ఆనాటి కవులు ఉహాజనితమైన కథలు చెప్పినప్పటికీ అవి మానవజీవితానికి ఉపదేశాత్మకమైన నీతిప్రభోధం కల్గించేవన్నారు .ఈ నాటి సమాజం ఇది తెలుసుకోలేకపోతుందని ఇతర దేశస్థులు తెలుగు భాష మాధుర్యాన్ని గ్రహించి మన వారసత్వ సంపదను ఇతర దేశాలకు తరలించారన్నారు. తెలుగు భాషలో ఉన్న ఈ మాధుర్యాన్ని సామాన్య ప్రజల చెంతకు తీసుకురావటానికి గిడుగు ఏంతో కృషి చేసి అందులో విజయం సాధించారన్నారు. అయితే అయన చేసిన ప్రయత్నం వృధా ప్రయాస కాకుండా నేటి యువత ప్రాచీన గ్రంధాలతో పాటు ఆధునిక కావ్యాలు చదివి జీవితాన్ని చక్కదిద్దుకుంటూ తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలన్నారు.

అనంతరం తెలుగు పరిశోధక విద్యార్థి శ్రీ ఇళ్ళ మురళీధరరావు రచించిన పద్యకావ్యాలను ఆవిష్కరించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్ ,డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ ఏ.వెంకటేశ్వర్లు (యోగి), పరిశోధక విద్యార్థులు, తెలుగు విభాగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## వయోవృద్ధులు సంక్షేమంపై

# అధ్యాయనం నివేదిక ఆవిష్కరణ



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటర్ పర్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రచురించిన పరిశోధన పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఇటీవల తన కార్యాలయంలో ఆవిష్కరించారు. దేశంలో వృద్ధులు గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్నారా, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య ఇతర అంశాలు వారికి చేరువవుతున్నాయా లేదా అనే అంశాలను భాగం చేస్తూ రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు వచ్చిన 23 పరిశోధన పత్రాల సంకలనంగా 'ఎల్డర్లీ పర్సన్స్ ఇన్ ఇండియా- సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ వెల్ఫేర్' పేరిట పుస్తకాన్ని తీర్చిదిద్దారు. దీంతో పాటు సెంటర్ ఆధ్వర్యంలో విశాఖలోని వివిధ మురికివాడల్లో ప్రత్యేకంగా 'ఓల్డ్‌ఏజ్ పెన్షన్స్ అండ్ సోషల్ ఇంక్లూజన్ ఆఫ్ ది ఎల్డర్లీ-ఏ స్టడీ ఆఫ్ ది స్లమ్స్ ఆఫ్ విశాఖపట్నం సిటీ' అంశంపై అధ్యయనం నిర్వహించారు. దీనిలో భాగంగా 87 శాతం మంది వృద్ధులు వృద్ధాప్య పెన్షన్ తమకు ఉపయుక్తంగా నిలుస్తోందని, సామాజికంగా తమకు గుర్తింపు లభిస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. 83.5 శాతం మంది ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పెన్షన్ పెంపు తమకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని తెలిపారు. ఈ సర్వే నివేదికను వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు, విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతే..

# నిజమైన సంపద



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ప్రతి వ్యక్తికి సృజనాత్మకతే నిజమైన సంపద అని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అంకుర సంస్థల దిశగా యువత సామర్థ్యాల పెంపు అనే అంశంపై ఇటీవల ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు ఆర్.విజయశాంతి స్మారకార్థం ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా రెక్టార్ ఆచార్య సమతి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ సంక్లిష్ట విధానాల్లో ఆలోచించడం, డిజైనింగ్ చేయడం, స్టార్టప్‌లు స్థాపించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడం లక్ష్యంగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆ హబ్ మేనేజర్ దివాకర్ స్టార్టప్స్ విస్తృతి, ప్రగతి, అనుకూల పరిస్థితులను వివరించారు. డాక్టర్ రవి సరిపల్లి డిజైన్ థింకింగ్ అంశంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత నుంచి 44 నవ్య ఆలోచనలు వచ్చాయన్నారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని తమ నవ్య ఆలోచనలను పంచుకున్నారు. విభాగాధిపతి ఆచార్య పి. మల్లికార్జునరావు, బీవో ఎస్ చైర్ పర్సన్ ఆచార్య కె. రమాసుధ, ఆర్.వి.ఎన్. మూర్తి, పి.కాంత ప్రసాద్, డాక్టర్ కె.పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగులపై కోవిడ్-19 తీవ్ర ప్రభావం



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు సంఘం ఆధ్వర్యంలో వ్యాపార వ్యూహం - పోస్ట్ కోవిడ్-19 అనే అంశంపై ఇటీవల వర్సిటీలోని జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకర రావు ముఖ్య అతిథిగా హాజరైరయ్యారు. కోవిడ్-19 ప్రభావం తర్వాత అనేక సంస్థల్లో పనిచేస్తున్న వారు ఉపాధి అవకాశాలను కోల్పోయారని, అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు వివిధ వనరులను ఉపయోగించుకోవాల్సి వస్తోందని ఆయన అన్నారు. కోవిడ్ కారణంగా చాలా వ్యాపార సంస్థలు కూడా నష్టపోయాయన్నారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు వివిధ సంస్థలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు వారికి సహకారం అందించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. కోవిడ్ మహమ్మారి సమయం లో డిజిటల్ మార్కెటింగ్‌కు మంచి ఆదరణ లభించిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యాపార వ్యూహాలు, మెంటరింగ్ స్టార్టప్‌లు వాటి వృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

# ఈ వారం డాక్టరేట్లు



## పాలిటికల్ సైన్స్‌లో రాజేష్‌కు డాక్టరేట్




**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్ధి అర్జి రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. ‘ రోల్ ఆఫ్ ఈ-గవర్నెన్స్ ఇన్ రూరల్ డవలప్‌మెంట్ – ఏ స్డడీ ఆఫ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ’ అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా రాజేష్ వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆచార్య ప్రేమానందం పర్యవేక్షణలో రాజేష్ పరిశోధనలు సాగాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు రాజేష్‌కు అభినందనలు తెలియజేశారు.

## కామర్స్‌లో సత్యనారాయణకు డాక్టరేట్



**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్ధి సకుమళ్ళ సత్యనారాయణకు డాక్టరేట్ లభించింది. ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా ‘ ప్రోబ్లమ్స్ అండ్ ప్రోస్పెక్ట్స్ ఆఫ్ పిసైకల్చర్ ఫార్మర్స్ ’ ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు పిసైకల్చర్ ఫార్మర్స్ ఇన్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ఆఫ్ ంధ్రప్రదేశ్ అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా సత్యనారాయణ వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆచార్య జి.సుదర్శనరావు పర్యవేక్షణలో సత్యనారాయణ పరిశోధనలు సాగాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు సత్యనారాయణ కు అభినందనలు తెలియజేశారు.

## పబ్లిక్ అడ్మినిష్ట్రేషన్‌లో దేవానంద్‌కు డాక్టరేట్




**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్ధి విప్పర్ల దేవానంద్‌కు డాక్టరేట్ లభించింది. ‘ ఏ స్టడీ ఆన్ ఇష్యూస్ అండ్ కాన్సిక్వెన్సస్ ఆఫ్ బైఫర్‌కేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌టు టూ సపరేట్ స్టేట్స్’ అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా విప్పర్ల దేవానంద్ వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆచార్య ప్రేమానందం పర్యవేక్షణలో దేవానంద్ పరిశోధనలు సాగాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు దేవానంద్ కు అభినందనలు తెలియజేశారు.

## కామర్స్‌లో అనురాధకు డాక్టరేట్




**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్ధి చల్లా అనురాధకు డాక్టరేట్ లభించింది. కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ద్వారా “ సస్టైనబుల్ డెవలప్మెంట్ స్ట్రాటజీస్ ఇన్ ఫిషరీస్ సెక్టార్ “ ఏ స్టడీ ఎక్స్పురిమెంట్ ఆఫ్ ఫిషర్ వుమెన్ ఇన్ సెలెక్ట్ విలేజస్ ఆఫ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. ఆచార్య ఉమాదేవి, ఆచార్య కృష్ణ మోహన్ ల పర్యవేక్షణలో ఈ పరిశోధనలు జరిగాయి. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా అనురాధ వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు అనురాధ కు అభినందనలు తెలియజేశారు.

# భారీ పుస్తక రచనలో తేజేశ్వరరావుకు భాగస్వామ్యం

### గుర్తింపు పత్రాన్ని అందించిన గిన్నిస్ బుక్ నిర్వాహకులు

### అభినందించిన వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి




**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ప్రపంచంలోనే భారీ పుస్తక రచనలో భాగస్వామిగా నిలచిన ఏయూ రసాయన శాస్త్రం విభాగం పరిశోధక విద్యార్థి డాక్టర్ వూన్న తేజేశ్వరరావును గిన్నిస్ బుక్ గుర్తింపు లభించింది. తమిళనాడుకు చెందిన ఈ ఎస్ఎన్ పబ్లికేషన్స్ సంస్థ 1,00,100 పేజీలతో కూడిన 19.34 అడుగుల ఎత్తు కలిగిన ‘వరల్డ్ 2023 వైడ్ అవుట్‌కమ్స్ ఆన్ రీసెర్చ్ అండ్ లేటెస్ట్ డెవలప్‌మెంట్స్’ పుస్తకాన్ని తీర్చిదిద్దింది. ఈ పుస్తకానికి తేజేశ్వరరావు దాదాపు వెయ్యిపేజీలతో కూడిన 25 చాప్టర్స్‌ని రచించి ఇచ్చారు. దీనిని పరిశీలించిన గిన్నిస్ బుక్ నిర్వాహకులు తేజేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికేట్, మెడల్‌ను ఇటీవల చెన్నైలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఎం.వి.ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న తేజేశ్వరరావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి తేజేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల కరాస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# టేకు కలప అమ్మేశారన్నది.. దుష్ప్రచారమే

### అవాస్తవ కథనాలపై స్పందించిన ఏయూ అధికారులు

### పత్రికా ప్రకటన ద్వారా ఖండించిన ఏయూ మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ





**ఏయూ న్యూస్, ఆగస్టు/సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వ విద్యాలయంలో ప్రధానమంత్రి బహి రంగసభ నిర్వహించిన సమయంలో భద్రతా చర్యలలో భాగంగా జీవీఎంసీ తొలగించిన టేకుచెట్ల కలపను ఏయూ అధికారులు అమ్మేసు కున్నారు, దోచేసుకున్నారు అంటూ కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలపై ఏయూ అధికారులు ఖండించారు. ఆయా వార్తలు దుష్ప్రచారమేనని స్పష్టం చేశారు. ఆ కలపను ప్రత్యేక ప్రదేశంలో భద్రపరచినట్లు వెల్లడించారు. ఏయూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్ ఖాన్, ఏయూ శానిటేషన్ డీన్ ఆచార్య జి.వీర్రాజులు ఇటీవల ఆ కలపను భద్రపరచిన ఫోటోలను విడుదల చేశారు. ఏయూలో తొలగించిన టేకు చెట్ల కలపను ఎవ్వరికీ విక్రయించలేదని స్పష్టం చేశారు. ఇటీవల ఏయూ ఇంజనీర్ ఆర్.శంకర రావు, బ్యూటిఫికేషన్ విభాగం డీన్ ఆచార్య జి.వీర్రాజుతో కలసి సిఎస్ఓ టేకు చెట్లు భద్రపరచిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల పలు పత్రికల్లో ఏయూలో తొలగించిన లక్షలు విలువచేసే టేకు చెట్లు ఎవరికి విక్రయించారు? ఆ సొమ్ము ఎవరు తిన్నారూ? అంటూ వచ్చిన వార్తలను తప్పుబట్టారు. అవగాహన రాహిత్యంతో, బాధ్యతారహిత్యం కారణంగా పలు పత్రికలు అసత్యాలను ప్రచారం చేస్తూ, ఏయూపై విషం చిమ్ముతున్నాయన్నారు. ఇలాంటి ప్రచారాన్ని ప్రజలు, ఏయూ వర్గాలు నమ్మవద్దని సూచించారు. ఇప్పటికైనా ప్రతికా ప్రతినిధులు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.

# ఏయూ విద్యార్థి.. గ్రూప్-1లో మెరిశాడు



## ఏయూ ప్రోత్సాహం వెలకట్టలేనిది

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించడం నాకు ఎంతో ప్రత్యేకమైనది. ఇక్కడి వారితో నాకు మంచి అనుబంధం ఉంది. జాగ్రఫీ విభాగం ద్వారా ప్రస్తుతం ఆచార్య సునీత మేడమ్ పర్యవేక్షణలో నా పరిశోధనలు సాగుతున్నాయి. ఇక్కడి వాతావరణం నాకు చాలా నచ్చింది. ఆచార్యులు, తోటి పరిశోధక విద్యార్థులు అన్ని విషయాల్లో చాలా స్నేహపూర్వకంగా ఉంటారు. చదువు విషయంలో ఇక్కడి ఆచార్యులు ఇచ్చే గైడెన్స్ ఎంతగానో నచ్చింది. ఆచార్య సునీత పర్యవేక్షలో నా రీసెర్చ్ కొనసాగుతుండటంతో అన్ని విషయాలను మేడమ్‌తో చర్చిస్తుంటాను. మేడమ్‌తో పాటు విభాగ ఆచార్యులంతా నాకు మంచి గైడెన్స్ ఇవ్వడం జరిగింది. గ్రూప్స్‌లో విజయం లభించగానే ఇక్కడి ఆచార్యులు, విద్యార్థులు చాలా ఆనందం వ్యక్తం చేశారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సార్ దగ్గరకు తీసుకెళ్లి నా విజయాన్ని వెల్లడించారు. వీసీ సార్ అభినందించడంతో పాటు సత్కరించడం ఎప్పటికీ మరువలేనిది. ఈ విజయంలో ఏయూ సహకారం కూడా ఉందని భావిస్తున్నాను. పోటీ పరీక్షలకు సిద్ద మయ్యే వారికి ఏయూ మంచి వేదిక. చదువుతో పాటు ఇక్కడ వున్న వనరులను వినియోగించుకుంటే మంచి ఉద్యోగాలు పొందవచ్చు. ప్రధానంగా ఏయూ లైబ్రరీలో ఉన్న పుస్తకాలు అన్ని అంశాల్లోను విజ్ఞానం పెంచుకోవాడానికి బాటలు వేస్తాయి. వర్సిటీలో నా పరిశోధనలు పూర్తయ్యే వరకు ఇక్కడ ఉన్న వనరులను వినియోగించుకుంటూ విజ్ఞాన్ని పెంచుకోవాలని భావిస్తున్నాను.



## నా ప్రస్థానం సాగింది ఇలా..

మాది ఉమ్మడి విజయనగరం జిల్లా (పార్వతీపురం మన్యం జిల్లా) సాలూరు పట్టణం. మా నాన్నగారు ఎలక్ట్రికల్ షాపును నడుపుతుండగా అమ్మ గృహిణి. బొబ్బిలిలో శ్వేతా చలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నా పాఠశాల విద్యాభ్యాసం జరిగింది. పదవ తరగతిలో 600 మార్కులు గాను 574 మార్కులు సాధించి స్కూల్ టాపర్గా నిలిచాను. నాకు చిన్నతనం నుంచి సామాజిక అంశాల పై ఆసక్తి ఎక్కువ. ఇంటర్ లో హెచ్‌ఈజీ చేసిన నేను గ్రాడ్యుయేషన్ కోసం ఢిల్లీ వెళ్ళాను. ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ కళాశాల కిరోర్ మాల్ లో జాగ్రఫీ లో బిఏ తో పాటు మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసాను. అనంతరం యూజీసీ నెట్ సాధించడంతో పాటు జెఆర్ఎఫ్ కు అర్హత పొందాను. ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయం జాగ్రఫీ విభాగంలో ఆచార్య పి.సునీత పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థిగా కొనసాగుతున్నాను.



## వారి సంకల్పమే నడిపించింది

ఈ భగీరథ ప్రయత్నంలో మా తల్లి దండ్రుల ప్రోత్సాహం వెలకట్టలేనది. నేను ఈ విజయానికి చేరువ కావడానికి వాళ్లు ఎంతగానో కృషి చేశారు. సాధారణ మధ్యతరగతి కుటుంబం అయినప్పటికీ వారు నా విద్యాభ్యాసం విషయంలో ఎప్పుడూ ఎటువంటి రాజీ పడలేదు. చదువు విషయంలో మా తల్లిదండ్రులు తొలి నుంచి ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ శక్తివంచన లేకుండా నా విజయానికి బాటలు వేశారు. నా విజయం తరువాత నాకంటే వాళ్లే ఎక్కువ ఆనందించారు. వారి కల్లల్లో ఆనందం చూసి నేను చాలా గర్వపడ్డాను. ఈ విజయాన్ని నా తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నాను. ఎందుకంటే వారి అకుంటిత దీక్ష, ప్రోత్సాహం లేకుండా నేను ఈ విజయాన్ని సాధించే ఉండేవాడిని కాదు.

## ప్రిపరేషన్ సాగిందిలా..

పరీక్ష, ఇంటర్వ్యూల ప్రిపరేషన్‌లో తొలి నుంచి అవగాహన పెంచుకున్నారు. ఎలాంటి అంశాలపై దృష్టిసారించాలి, ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు అనే విషయాలపై పట్టు పెంచుకున్నారు. మెయిన్స్ పరీక్షలో ఎక్కువ స్కోరు చేయడానికి టైం మేనేజ్మెంట్ చేసుకు ని సమాధానంకి సంబంధిత చిత్రాలు, మ్యాప్, చార్ట్లు వంటివి జోడించాను. ఇంటర్వ్యూ ప్రిపరేషన్ కోసమైతే నా సీనియర్ల నుండి మెలకువలు తెలుసుకున్నాను. గ్రూప్-1కు సంబంధించి అనేక ఇంటర్వ్యూలు అంతర్జాలంలో అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆయా ఇంటర్వ్యూలను బాగా పరిశీలించాను. కోచింగ్ అకాడమీలతో మాక్ ఇంటర్వ్యూలను అభ్యసించాను. అక్కడ వారు చెప్పిన మెలకువలు, ముందుస్తు అవగాహన కార్యక్రమాలు నా విజయానికి ఎంతగానో దోహదపడ్డాయి. వాటికి అనుగుణంగా పరీక్షతో పాటు ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిచేయగలిగాను.

## యువతకు నా సందేశం

యువత తలుచుకుంటే సాధ్యం కానిది, చేయలేనిది ఏమీ లేదు. వారికి ఏమి కావాలో, ఏ రంగంలో రాణించాలను కుంటున్నారో ముందుగా గుర్తించగలగాలి. దానికి అనుగుణంగా లక్ష్య సాధన దిశగా వారి జర్నీ సాగాలి. ఈ విష యంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా వారికి ఉండాలి. పిల్లల వారి ఆశక్తికి అనుగుణంగా ముందుగు సాగాడానికి, అనుకున్నది సాధించడానికి తల్లిదండ్రులు అండగా నిలబడాలి. యువత పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి అనుకున్నప్పుడు సరిపడా మెటీరియల్ ని అందుబాటులో ఉంచుకోవాలి. ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ ఉండేలా చర్యలు చూసుకోవాలి. ప్రీవియస్ పేపర్లను పెద్ద ఎత్తున పరిశీలించాలి. పునఃశ్చరణ, మాక్ టెస్ట్‌లు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. కృషి , పట్టుదల, నిబద్ధత, శ్రద్ధతో పాటు సాధించాలనే అంకితభావం సడలకుడా ముందుకుసాగాలి. ఎన్ని గంటలు చదివామన్నది కాకుండా ఎంత సబ్జెక్ట్ నేర్చుకున్నామన్నదే ముఖ్యం తీసుకోవాలి. సాధించాలనే పట్టుదలను యువత పెంపొందించుకోవాలి.

# పేదప్రజల గుండె చప్పుడు వైఎస్ఆర్

## ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

### వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించిన వర్సిటీ శ్రేణులు





**ఏయూ న్యూస్, ఆగస్టు/ సెప్టెంబర్ :** పేద ప్రజల గుండె చప్పుడు స్వర్గీయ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర రెడ్డి అని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఏయూలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఇటీవల నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల హృదయాలలో ఎప్పటికీ నిలిచే ఉంటారన్నారు. మహానేత మరణం ఎందరినో కలచివేసిందన్నారు. ప్రతీ హృదయం తల్లడిల్లిందన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి అహర్నిశం కృషిచేసిన వ్యక్తి వై.ఎస్.ఆర్ అని కొనియాడారు. ఏయూలో సకాలంలో అధ్యాపక నియామకాలు జరిపిన ఘనత వై.ఎస్ రాజశేఖర రెడ్డి సొంతమన్నారు. ఆయన హయాంలో నియామకమైన ఆచార్యులే నేడు వర్సిటీలో విధులు నిర్వహిస్తూ, నేడు వర్సిటీ ప్రగతిలో కీలకంగా నిలచారన్నారు. బోధనేతర సిబ్బందికి సైతం టైంస్కేల్, 28 డేస్ వంటివి వర్తింప చేశారన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ నేడు ఎందరినో ఉన్నత విద్యావంతులుగా నిలుపుతొందన్నారు. దీనికి మరింత శక్తిని ఇచ్చే విధంగా వైఎస్సార్ తనయుడు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కుటుంబానికి విద్యపై ఉన్న నమ్మకం దీనికి నిదర్శనమన్నారు. దేశానికి అవసరమైన విలువైన మానవ వనరులను అందించే దిశగా ఈ పథకం ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి వైఎస్సార్ విగ్రహాన్ని ఏయూలో నెలకొల్పడం జరిగిందన్నారు. విద్య, వైద్య రంగాలకు వైఎస్ఆర్ చేసిన కృషి, చేపట్టిన సంక్షేమం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయనతో పాటు ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి మరింత ఉత్సాహంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమతతో పాటు పలువురు ఏయూ ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆరుగురు ఏయూ ఆచార్యులు

**ఏయూ న్యూస్, ఆగస్టు/ సెప్టెంబర్ :** ఆరుగురు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించే విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయ ప్రముఖులను జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, న్యాయ కళాశాలకు చెందిన ఆచార్య కె.సీతామాణిక్యం, సైన్స్ కళాశాల మెటరాలజీ, అండ్ ఓషనోగ్రఫీ విభాగానికి చెందిన ఆచార్య సీవీ నాయుడు, కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఆచార్య పి.శ్యామల, ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆచార్య కె.రామసుధ , కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆచార్య డి.లలితాబాస్కరిలు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్యులు ఈ అవార్డులు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు వర్సిటీ ఉన్నతాధికారులు అవార్డులకు ఎంపికైన ఆచార్యులకు అభినందనలు తెలియజేశారు. ఆరుగురు వర్సిటీ ఆచార్యులు ఈ ఏడాది అవార్డు ఎంపికకావడం గర్వకారణమని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి పేర్కొన్నారు.


ఆచార్య ఎన్.కిషోర్‌బాబు


ఆచార్య సీవీ నాయుడు


ఆచార్య కె.రమాసుధ


ఆచార్య డి.లలితాబాస్కరి


ఆచార్య పి.శ్యామల


ఆచార్య కె.సీతామాణిక్యం

# వీసీకి రాఖీ శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మకుమారీలు





**ఏయూ న్యూస్, ఆగస్టు/ సెప్టెంబర్ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డికి బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. ఇటీవల రాఖీ పండగను పురస్కరించుకొని వీసీ కార్యాలయంలో వచ్చి ఆయనకు రాఖీ పూర్ణిమి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటారు. దీంతో పాటు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌నుకు సైతం బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. ఆయని కార్యాలయానికి వెళ్లి ఆయనతో పాటు కార్యాలయ సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏయూ పరిశోధక విద్యార్థిగా ఆర్‌టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



**ఏయూ న్యూస్, ఆగస్టు/ సెప్టెంబర్ :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లేనరీ రీసెర్చ్ హబ్‌లో పరిశోధక విద్యార్థిగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్ ద్వారకా తిరుమల రావు ప్రవేశం పొందారు. ఇటీవల ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి ఆయన ఉత్తర్వులను స్వీకరించారు. అనంతరం ఏయూ వీసీతో ఆయని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు సంస్థలకు సంబందించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్‌టిసి కార్గో సేవలకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో వస్తువులను రవాణా చేయడంతో ప్రజలు గణనీయంగా ఆదరిస్తున్నారన్నారు. నూతనంగా బస్‌లు కొనుగోలు, ఎలక్ట్రిక్ బస్‌ల వినియోగం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూలో బిబిఏ, ఎంబిఏ చేస్తున్న విద్యార్థులకు ఆర్‌టిసి సంస్థలో ఇంటర్న్‌షిప్ కల్పించాలని కోరారు. వర్సిటీ నుంచి త్వరలో లిఖితపూర్వకంగా ప్రతిపాదన పంపుతామన్నారు. ఏయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందిచడానికి ఆర్‌టిసి ఎండీ తిరుమలరావు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# గోల్డ్ మెడల్ ఏర్పాటుకు నిధులు

### స్టాటస్టిక్స్ విభాగంలో ఆచార్య కె.శ్రీనివాస రావు పేరుతో ఏర్పాటు

### నిధులను అందించిన పూర్వవిద్యార్థులు

**ఏయూ న్యూస్, ఆగస్టు/ సెప్టెంబర్ :** విద్యాబుద్ధులు చెప్పిన గురువు పేరుతో గోల్డ్ మెడల్, ప్రైజ్ మనీ ఏర్పాటు చేశారు. తమ ఉన్నతికి కారణమైన గురువు పేరు చిరస్థాయిగా ఉంటూ, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని అందించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం స్టాటస్టిక్స్ విభాగం ఆచార్యులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీనివాసరావు, సుధారాణి పేరుతో బంగారు పతకం, ప్రైజ్ ఏర్పాటు చేయాలని రూ.4.5 లక్షలు ఏయూకు విభాగ పూర్వ విద్యార్థులు అందించారు. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లకు దీనికి సంబంధించిన బ్యాంకు డీడీని అందజేశారు. ఎమ్మెస్సీ స్టాటస్టిక్స్‌లో ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి వీటిని అందించాలని కోరారు. ఆచార్య శ్రీనివాస రావు వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలసి దీనిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్టాటస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య నిరుపమదేవి, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ చదువే...


# ఉత్తమంగా నిలిపింది

– ఏయూను సందర్శన సందర్భంగా కెమిస్ట్రీ 84 -86 బ్యాచ్ పూర్వవిద్యార్థుల – వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వక సమావేశం



ఆంధ్రవిశ్వవిద్యాలయం మాకు ఉన్నత చదువును అందించడంతో పాటు జీవితంలో ఉత్తమంగా నిలిపిందని వర్సిటీ కెమిస్ట్రీ విభాగ 1984-86 బ్యాచ్ పూర్వవిద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యాలంతా ఇటీవల వర్సిటీని సందర్శించారు. కెమిస్ట్రీ విభాగానికి వెళ్లి వారి విద్యాభ్యాసం నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు, ఆచార్యుల మార్గదర్శకాన్ని, చదువులో పోటీతత్వాన్ని, అల్లరి చేష్టలను నెమరువేసుకొని ఒకరికి ఒకరు ఆహ్లాదాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ విభాగ ఆచార్యుడు, వర్సిటీ సీడీసీ అసోసియేట్ డీన్ ఆచార్య సిద్దయ్యతో ఆధ్వర్యంలో కలిసి ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. వర్సిటీలో విద్యాభ్యసం కారణంగా వారు సాధించిన విజయాలు, ఉత్తమంగా ఎదిగిన తీరును వీసీతో పంచుకున్నారు. దేశవిదేశాల్లో వారు స్థిరపడడానికి వర్సిటీ అందించిన ఉత్తమ విద్యే వారధిగా నిలిచిందని తెలిపారు. అనంతరం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధిని వారికి వివరించారు. విద్యార్థులను సాంకేతికత దిశగా ముందుకు నడిపించేందుకు , భవిష్యత్ తరాలకు మార్గం చూపించేందుకు వర్సిటీ యంత్రాంగం భారీ మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఉత్తమ భోధన, పరిశోధనలే లక్ష్యంగా అనేక మార్పులు తీసుకొచ్చినట్లు వీసీ తెలిపారు. వర్సిటీలో స్టార్టప్ కల్చర్ అభివృద్ధితో విద్యార్థుల ఆలోచన, సృజనాత్మకత వెలికితీసేందుకు వర్సిటీ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. వర్సిటీ ర్యాకింగ్‌లో మెరుగుపరుచుకోవడంలో భాగంగా అంతర్జాతీయంగా ఏయూ విస్తృత ప్రచారంలోకి వచ్చే విధంగా పూర్వవిద్యార్థులు సహకారం అందించాలని వీసీ కోరారు. అనంతరం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో వారు పోటోలు దిగి వారి ఆనందాన్ని, ఆత్మీయతను పంచుకున్నారు.


### క్యాంపస్ పూర్తిగా మారిపోయింది



విభాగంలో ప్రయోగశాలలు, సమావేశ మందిరాలు, ఆధునీకరణ పనులు ప్రత్యక్షంగా వీక్షించాం. ఐదు సంవత్సరాల క్రితం నేను విభాగాన్ని సందర్శించాను. ఈ మధ్య కాలంలో విభాగాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించడం జరిగింది. ప్రస్తుత వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మార్గదర్శకంగా రసాయన శాస్త్ర విభాగమే కాకుండా, ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ కోర్సులలో సమగ్ర అభివృద్ధి చోటుచేసుకోవడం శుభదాయకం. విశ్వవిద్యాలయం అభివృద్ధి అత్యంత సంతృప్తిని కలిగిస్తోంది. గత కొన్నేళ్లు వర్సీటీలో జరిగిన మార్పులు వర్సిటీ అభివృద్ధి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**– పి.వెంకటేశ్వర రావు,**
అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ ఆఫీసర్
సౌత్ సెంట్రల్ రైల్వే, విజయవాడ

### జీవితంలో ఉత్తమంగా నిలిపింది ఏయూనే



ఆంధ్రవిశ్వవిద్యాలయంతో మాకు విడదీయరాని బంధం ఉంది. మమ్మల్ని జీవితంలో విజేతలు, ఉత్తమంగా నిలిపిన ఘనత ఏయూకే దక్కుతుంది. ఇక్కడ చదవడం ద్వారానే మా బ్యాచ్‌కు చెందిన అనే మంది విద్యార్థులం ఉన్నతంగా స్థిరపడ్డాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాం. వర్సిటీలో విద్యాభ్యాసం అనంతరం నేను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సస్‌లో పీహెచ్‌డీ చేశాను. దీంతో మంచి భవిష్యత్ లభించింది.

**– జీవీఆర్ శర్మ,**
కెమిస్ట్రీ విభాగ ఆచార్యులు, గీతం యూనివర్సిటీ

### కెమిస్ట్రీది ఘనమైన చరిత్ర

ఏయూ కెమిస్ట్రీ విభాగానికి ప్రతిష్టాత్మక చరిత్ర ఉంది. ఇండియాకి స్వాతంత్ర్యయం రాకముందే ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఈ విభాగం ఏర్పాటయ్యింది. ఆర్గానిక్‌తో పాటు ఇన్‌ఆర్గానిక్-ఎనలాటిక్, ఫిజికల్ కెమిస్ట్రీలను ప్రత్యేక కోర్సులుగా అందిస్తూ అప్పటి వర్సిటీ పాలకులు తొలుతా ఈ విభాగం ప్రారంభించారు. దీంతో ఇక్కడ విద్యనభ్యసించిన ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలిచారు. అనంతరం 1983లో ఈ విభాగం మూడు విభాగాలుగా రూపాంతరం చెందింది. ఆర్గానిక్, పాటు ఇన్‌ఆర్గానిక్-ఎనలాటిక్, ఫిజికల్ కెమిస్ట్రీలు ప్రత్యేక విభాగాలు మార్పు చెందాయి. తద్వారా వేల దశాబ్ధాలుగా వేల మంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నాయి. వందల మంది విద్యార్థులు ఉత్తమంగా నిలిపింది.

### విభాగానికి చేదోడుగా..

విభాగ అభివృద్ధిలో 1984- 86 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వాములు అవుతున్నట్లు విభాగ ఆచార్యులు సిద్ధయ్య వెల్లడించారు. విభాగానికి ఆధునాతన ల్యాబ్‌ను అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా ఈ బ్యాచ్‌కు చెందిన సన్ పార్మా అధినేత విభాగంలో ల్యాబ్ నిర్మాణానికి సాకారం అందించనున్నట్లు తెలిపారన్నారు. త్వరలోనే ఈ ల్యాబ్ సాకారం కానున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు విభాగం ద్వారా ఎమ్మెస్సీ పూర్తిచేసిన ఎందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలకు సీఈఓలుగా ఉన్నారన్నారు. నాక్ పర్యటన సమయంలో విభాగ పూర్వ విద్యార్థుల ద్వారా విభాగ ప్రోత్సాహాన్ని టీమ్ సభ్యులకు వివరించేందుకు పూర్వవిద్యార్థుల సహకారం తీసుకోనున్నట్లు ఆచార్య సిద్దయ్య వెల్లడించారు.

### 40 ఏళ్ల తీపి జ్ఞాపకం ఏయూ



ఏయూలో కెమిస్ట్రీలో పీజీ పూర్తిచేశాను. ఏయూను సందర్శించడం చాలా ఆనందంగా ఉంది. ఏయూలో నేను ఎమ్మెసీ చేసి వచ్చే సంవత్సరానికి 40 ఏళ్లు పూర్తవుతుంది. ఆ రోజుల్లో మాకు బోధన చేసిన ఆచార్యులు మా భవిష్యత్తుకు అవసరమైన బలమైన పునాదులు వేశారు. ప్రస్తుత ఉపకులపతి ఆచార్య ప్రసారెడ్డి ఏయూను అభివృద్ధి చేస్తున్న విధానం ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాము. భవిష్యత్ విజన్‌తో ప్రస్తుతం వర్సిటీ అబివృద్ధి జరుగుతుంది. పూర్వ విద్యార్థులుగా మావంతు సహకారం, తోడ్పాటు ఆంధ్రవిశ్వవిద్యాలయానికి అందించడానికి సిద్దంగా ఉన్నాము.

**– డాక్టర్ వెంకట పల్లె**
గ్లోబల్ హెడ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సన్ ఫార్మా

### మా కలల సౌధం ఆంధ్రవిశ్వవిద్యాలయం.



ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రగతిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానను. ప్రస్తుత అభివృద్ధి చూస్తుంటే భవిష్యత్తులో వర్సిటీ మరింత పేరు ప్రతిష్టలను సంపాదించుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నూతన మార్పులను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్నారు. అంతర్జాతీయ వర్సిటీల సరసన ఏయూను నిలిపేందుకు వీసీతో పాటు యంత్రాంగం విస్తృతంగా కృషి చేస్తోంది. మా బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం ఏర్పాటు చేసుకుని, విభాగాన్ని, ఏయూను సందర్శించడానికి వచ్చాం.

**– ఏ.విశ్వేస్వరరావు,** ప్రిన్సిపల్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ అడ్వైజర్
ఇండిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా

Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha,Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422